## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చీమకుర్తి: 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా గురువారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏడీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయుడుపాలెం, బండ్లమూడి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని నాయుడుపాలెం, బండ్లమూడి, తొర్రగుడిపాడు, ఎర్రగుడిపాడు, మంచికలపాడు, పల్లామల్లి, గాడిపర్తివారిపాలెం, నేకునంబాద్ గ్రామాలకు విద్యుత్ సరఫరాతో పాటు వ్యవసాయ కనెక్షన్లకు కూడా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు సహకరించ వలసిందిగా విజ్ఞప్తి చేశారు.

### మంచి ఆరోగ్యమే మహాభాగ్యం



సర్వేరెడ్డిపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాణి

ఒంగోలు రూరల్: ప్రజలు ఆరోగ్యంగా ఉండటం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తోందని కరవది పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాణి పేర్కొన్నారు. బుధవారం ఒంగోలు రూరల్ మండలంలోని సర్వేరెడ్డిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా పలు గృహాలను సందర్శించారు. జ్వర పీడితుల రక్తనమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అందరికీ ఆరోగ్యమే లక్ష్యంగా గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షల వివరాలు కంప్యూటరీకరణ చేస్తున్నామని తెలిపారు. ఏఎన్‌ఎంలు, ఆశాలు, హెల్త్ సూపర్‌వైజర్లు చేస్తున్న జ్వర సర్వేను నిశితంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కరవది హెచ్ఈఓ కృష్ణారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### విత్తనాల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు

తాళ్లూరు (ముండ్లమూరు): రైతులకు సరఫరా చేసే విత్తనాల్లో నాణ్యత లోపిస్తే అందుకు బాధ్యులైన డీలర్లపై కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ బి.ప్రసాదరావు హెచ్చరించారు. మండలంలోని తూర్పుగంగవరంలో వెంకటసాయి రైతు డిపో, శ్రీపసన్నాంజనేయ సీడ్స్ దుకాణాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపులోని రికార్డులకు, స్టాకు రిజిస్టర్, నిల్వ ఉన్న స్టాకు వివరాలను పరిశీలించారు. విత్తనాలు కొనుగోలు చేసే ప్రతి రైతులకు తప్పని సరిగా బిల్లు రసీదు ఇవ్వాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే షాపు నిర్వాహకులను రైతులు నిలదీయాలన్నారు. ఆయా దుకాణాల్లో నిల్వ ఉన్న వరి, సజ్జ, పచ్చ పెసల శాంపిల్స్‌ను సేకరించారు. క్వాలిటీ పరీక్షల కోసం రీజినల్ కోడింగ్ సెంటర్ తాడేపల్లిగూడేనికి పంపుతామని చెప్పారు. ల్యాబ్‌ల నుంచి పరీక్షల ఫలితాలు రాగానే నాణ్యత ప్రమాణాల ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. డీలర్లు అనుమతి పొందిన కంపెనీలకు చెందిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. లూజు విత్తనాలు అమ్ముతున్నట్లు రైతులు ఫిర్యాదు చేస్తే చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు. ఏఈఓ నాగరాజు, రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

### మళ్లీ సూర్యుడి ఉగ్రరూపం

కొమరోలు: వారం పది రోజులుగా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురుస్తూ వాతావరణం చల్లబడింది. దీంతో మండలంలోని ప్రజలు ఆహ్లాదకర వాతావరణంలో సేద తీరుతూ సరదాగా గడిపారు. రెండు రోజులుగా మళ్లీ సూర్యుడు ఉగ్రరూపాన్ని చూపిస్తున్నాడు. మంగళవారం 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా బుధవారం 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సూర్యుడు వేడితో పాటు ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### రేపు వేమయ్య స్వామి ఆరాధన మహోత్సవాలు

రాచర్ల: మండలంలోని చోళ్లవీడులో వేమయ్య స్వామి 262వ ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయాల కార్యానిర్వాహకులు బుధవారం తెలిపారు. వేమయ్యస్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా 31వ తేదీ శుక్రవారం సాయంత్రం కలశ గ్రామోత్సవం, జూన్ 1వ తేదీన శనివారం ఆలయంలో తెల్లవారు జామున 4 గంటలకు గణపతి పూజ, అభిషేకం, ఆఖండస్థాపన, అంకురారోపణం, మండల అవాహము కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తులకు తీర్థ ప్రసాదాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

### పిల్లలను మంచి ప్రవర్తనతో పెంచాలి

కురిచేడు: మండలంలోని పొట్లపాడులో తెలుగు బాప్టిస్టు చర్చిలో ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు గమ్యం వైపునకు పరుగు అనే కార్యక్రమం జరిగింది. సంఘకాపరి కొదమల ప్రసాదరావు పర్యవేక్షణలో సండే స్కూలు టీచర్స్, యూత్, సంఘ పెద్దల సహకారంతో కార్యక్రమం నిర్వహించారు. పసి మనస్సులను పాడు చేస్తున్న కలుషిత సమాజంలో మన బిడ్డలను మంచి ప్రవర్తనతో పెంచి గమ్యం వైపు సాగాలని సూచించారు. యాక్షన్ సాంగ్స్, స్కిట్స్, మైమ్స్, పప్పెట్ షో, మ్యాజిక్ షోలు బైబిల్ కథల ఆధారంగా జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులకు స్వీట్స్, భోజనాలు, గిఫ్ట్‌ను యూత్ నాయకులు అందించారు. ఆయా కార్యక్రమాల నిర్వహణకు సహకరించిన సంఘానికి సంఘ కాపరి కృతజ్ఞతలు తెలిపారు.

# సింధూర అలంకరణలో వీరాంజనేయుడు

ఒంగోలు మెట్రో: హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక కేశవ స్వామి పేటలోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో పంచాహ్నిక దీక్ష కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రెండో రోజు బుధవారం అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆంజనేయ స్వామికి ప్రీతికరమైన సింధూరంతో అలంకరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చందు డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు.

**పంచముఖ ఆంజనేయస్వామికి పూలంగి సేవ**

ఒంగోలు మెట్రో: హనుమత్ జయంత్యుత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం స్థానిక మంగమూరు రోడ్డు సుందర నగరంలో కొలువై ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో సుప్రభాతం, విష్వక్సేన పూజ, పుణ్యాహ వచనం, వాస్తు హోమం, విశేష మన్యసూక్త హోమం, అగ్ని ప్రతిష్టాపన, ఉక్త హోమం, సహస్రనామార్చన, మంగళహారతి, యజమాన ఆశీర్వచనం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు అగ్ని ధ్యానం, నవకుంభ స్థాపన, అభిమంత్రణ, లఘు పూర్ణాహుతి పూజలు చేశారు. దేవస్థానం కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సింధూర లేపన అలంకారంలో వీరాంజనేయ స్వామి



ప్రత్యేక అలంకరణలో పంచముఖ ఆంజనేయ స్వామి

# తెలుగు ప్రజలు మెచ్చిన నటుడు కృష్ణ

ఒంగోలు టౌన్: తెలుగు సినిమా ఖ్యాతిని హాలివుడ్ స్థాయికి పెంచి అభిమానుల సూపర్ స్టార్‌గా నిలిచారని దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం సూపర్ స్టార్ కృష్ణ 82వ జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలి కలర్, తొలి సినిమా స్కోప్, తొలి 70 ఎంఎం సినిమాల నిర్మాణంలో కృష్ణ చేసిన ప్రయోగాలు తదుపరి తరానికి ఒక పాఠ్య పుస్తకంగా నిలిచాయని కొనియాడారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు సినిమా ఎన్నో సంచలనాలు సృష్టించిందని, తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో నిర్మించి దర్శకత్వం వహించిన సింహాసనం పాటలు ఇప్పటికీ ప్రముఖంగా వినిపిస్తూనే ఉన్నాయన్నారు. కృష్ణ లాంటి సాహస నటుడు చరిత్రలో ఎవరూ లేరని, ఇక ముందు కూడా రారని అభిప్రాయం వ్యక్తం చేశారు. నటుడిగా రాణించడమే కాకుండా పేదలను ఆదుకోవడంలో కలియుగ కర్ణుడిగా పేరొందారని కీర్తించారు. హీరో కృష్ణ ఆ రోజుల్లోనే పాన్ ఇండియా స్థాయి జేమ్స్ బాండ్, కౌబాయ్ సినిమాలు చేసి ఔరా అనిపించుకున్నారని సభాధ్యక్షుడు మొగిలి దేవ పేర్కొన్నారు. కృష్ణ సినిమా విడుదలైన రోజున ఆయన అభిమానులు ఒకే రోజు నాలుగు ఆటలను చూసేవారని కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు కుర్రా ప్రసాదరావు తెలిపారు. తొలుత హీరో కృష్ణ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జాలాది మోహన్, దాసరి లక్ష్మీ ప్రసాద్, సుధాకర్ రావు, జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, ఎం.శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు, నత్తల శ్రీనివాసరావు, ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.



హీరో కృష్ణ చిత్రపటానికి నివాళులర్పించిన అభిమానులు

# వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ







కానిస్టేబుల్‌కు మజ్జిగ పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

ఒంగోలు మెట్రో: వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఐఏఫ్‌సీ అధికారి కనమర్లపూడి హరిప్రసాదరావు, వాసవి ప్రియదర్శిని పెళ్లిరోజు సందర్భంగా బుధవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వాసవి క్లబ్ ఒంగోలు ప్రెసిడెంట్ నల్లమల్లి బదరీ నారాయణ, సెక్రెటరీ, ట్రెజరర్ ఆధ్వర్యంలో విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఐ, వీఎన్ దర్శి మనోహర చంద్రశేఖర్, టంగుటూరి రంగస్వామి, అమరా లక్ష్మి వెంకట సత్యనారాయణ, పబ్బిశెట్టి గోవర్ధన్, సిటిజన్స్ సెక్రటరీ భూమా శ్రీను పాల్గొన్నారు.

# విలువలతో కూడిన విద్యతోనే ఉన్నత శిఖరాలు

- మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి అమ్మనరాజా

ఒంగోలు సిటీ: చిన్నతనం నుంచే విలువలతో కూడిన విద్య, క్రమశిక్షణ వలన జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఇన్‌చార్జ్ మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి డి.అమ్మనరాజా అన్నారు. బుధవారం ఒంగోలు పట్టణంలోని బాల సదన్ సందర్శించిన న్యాయమూర్తి అమ్మనరాజా విద్యార్థులకు అందుతున్న వసతి సదుపాయాలను పరిశీలించారు. అనంతరం దత్తత స్వీకారం కోసం సిద్ధంగా ఉన్న పిల్లల సర్టిఫికెట్లు పరిశీలించారు. మెరుగైన సదుపాయాలు, మెరుగైన వసతుల కోసం సూచనలు అందించారు. మానసిక వైద్యుల అవసరం ఉన్న పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి కె.శ్యాంబాబు, బాలసదన్ కార్యాలయ పర్యవేక్షకురాలు డి.జీవిత, పిల్లల చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ దినేష్, కె.శేఖర్ పాల్గొన్నారు.



విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తి అమ్మనరాజా

# భక్తిశ్రద్ధలతో శ్రీగిరి ప్రదక్షిణ



శ్రీగిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: వైశాఖ మాసం బహుళ పక్షం, శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం శ్రీగిరి ప్రదక్షిణ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శోభాయమానంగా అలంకరించిన రథంపై స్వామి, అమ్మవార్ల ప్రతిమలు కొలువుదీర్చి ఉదయం ఆరు గంటలకు శ్రీగిరి పాదపీఠం వద్ద బాపూజీ గో సంఘం నుంచి వందలాది మంది భక్తులు గరుత్మంత, హనుమాన్, శంఖుచక్ర నామాలు చేతబట్టి గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీగిరి ప్రదక్షిణ కమిటీ అధ్యక్షుడు జంధ్యం రాధారమణగుప్తా మాట్లాడుతూ.. శ్రవణా నక్షత్రం రోజున శ్రీవారిని దర్శించుకోవడం అత్యంత శుభప్రదమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు దాసరి నారాయణరావు, సహ కార్యదర్శి నేరెళ్ల శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు చలువాది బ్రహ్మయ్య, కోటి సూర్యనారాయణ, ధనిశెట్టి రామునాయుడు, పబ్బిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### భూసార పరీక్షలపై రైతులకు అవగాహన

తాళ్లూరు (ముండ్లమూరు): భూసార పరీక్షలపై దళిత రైతులు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకొని సాగు చేయాలని దళిత బహుజన రీసోర్స్ సెంటర్ రీజినల్ కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని లక్కవరంలో బుధవారం దళిత రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వ్యవసాయ సహాయకులు కె.వీరాంజనేయులు భూసార పరీక్షల ఆవశ్యకత, దాని ఫలితాలపై రైతులకు వివరించారు. ఏటా వేసవిలో దుక్కులు దున్నిన అనంతరం భూసార పరీక్షల చేయించుకోవాలన్నారు. తద్వారా ఆ భూమిలో ఏఏ పంటలు సాగు చేయవచ్చో ముందుగా తెలుసుకుంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేందుకు అవకాశం ఉందన్నారు. భూసార పరీక్షలతో భూమిలోని ఖనిజ లవణాలు, పోషకాల స్థాయిలను తెలుసుకోవచ్చన్నారు. లోపాలను గుర్తించి అందుకు అనుగుణంగా సేంద్రియ ఎరువులను వాడుకోవాలన్నారు. అనంతరం ఎస్సీ రైతుల పొలాల్లో సేకరించిన మట్టి నమూనాలను దర్శి కృషి విజ్ఞాన కేంద్రానికి డీబీఆర్‌సీ నాయకులు తీసుకెళ్లారు. భూసార పరీక్షల అనంతరం నివేదికలను రైతులకు అందజేయనున్నట్లు తెలిపారు.

# శ్రీవారికి విశేష పూజలు



వెలుగొండలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారు



రేగడపల్లిలో ప్రత్యేక అలంకరణలో శ్రీవారి ఉత్సవమూర్తులు

కొనకనమిట్ల: కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రం సందర్భంగా బుధవారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వారిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే వాగుమడుగు పంచాయతీ రేగడపల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి కుటుంబానికి తోటి మిత్రులు బుధవారం ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. కొత్తపట్నం మండలం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన నాటారు వెంకట్రావు(38)కు జెడ్పీ హైస్కూల్లో 2000 సంవత్సరంలో పదో తరగతి చదివాడు. ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే నాటారు వెంకట్రావు ఈ నెల 17న ప్రమాదశావత్తు బైక్ ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మిత్రుడి కుటుంబానికి సాయం చేసేందుకు పూర్వ విద్యార్థులంతా కలిసి రూ.66 వేలు పోగు చేశారు. మిత్రుడి కుటుంబ సభ్యులకు రూ.36 వేలు నగదు అందించడంతో పాటు, ఇద్దరు కుమార్తెల పేరుపై రూ.15 వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. వారికి వెంకట్రావు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఇటీవల చెన్నాపట్నం చంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుమార్తె వివాహానికి రూ.25 వేలు ఆర్థిక సహాయం చేశారు. మరో విద్యార్థి పుచ్చలపల్లి నాంచార్లు మృతి చెందగా ఆయన కుమార్తె పేరు మీద రూ.25 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. పూర్వ విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు.



మృతుడు వెంకట్రావు కుటుంబ సభ్యులకు రూ.66 వేలు ఆర్థిక సాయం చేస్తున్న మిత్రులు

### హనుమజ్జయంతిని విజయవంతం చేయాలి

దర్శి: మండలంలోని వెంకటాచలంపల్లి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో జరిగే హనుమజ్జయంతిని విజయవంతం చేయాలని స్వయం పాలకుల యలమందల కోటేశ్వరశర్మ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. జూన్ 1వ తేదీన 55వ హనుమజ్జయంతి జరుగుతుందని చెప్పారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ మండప పూజలు, మహన్యాస పూర్వక ఏకాదశారుద్ర వారాభిషేకాలు జరుగుతాయని చెప్పారు. స్వామి వారికి లక్ష తమలార్చన, అన్నప్రసాద వితరణ, సాయంత్రం కోలాట భజనలు ఉంటాయని వివరించారు.

# వార్డెన్‌కు ప్రశంస పత్రం



వార్డెన్, విద్యార్థికి ప్రశంసపత్రం అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

బేస్తవారిపేట: మండలంలోని గలిజేరుగుళ్ల బీసీ హాస్టల్ వార్డెన్ కె.లక్ష్మీకాంతరెడ్డి.. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంసపత్రాన్ని మంగళవారం అందుకున్నారు. హాస్టల్ విద్యార్థి ఎస్‌వీ భరత్ పదో తరగతిలో 589 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా ఒంగోలులో జరిగిన ప్రతిభ అవార్డుల పంపిణీ కార్యక్రమంలో విద్యార్థి ఎస్‌వీ భరత్‌కు ప్రతిభ అవార్డ్, వార్డన్ లక్ష్మీకాంతరెడ్డికి ప్రశంసపత్రాన్ని అందచేశారు.

### విద్యుదాఘాతంతో గేదె మృతి

రాచర్ల: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని ఆకవీడులో బుధవారం జరిగింది. వివరాలకు.. ఆకవీడు గ్రామానికి చెందిన వల్లపురెడ్డి జయరామిరెడ్డికి చెందిన పాడి గేదె గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదే విలువ రూ.80 వేలు ఉంటుందని రైతు జయరామిరెడ్డి తెలిపారు.

# సమయం ఏది మిత్రమా?

పొదిలి: ఆర్టీసీ బస్సుల్లో టైమింగ్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పొదిలి డిపో నుంచి అద్దంకి, కనిగిరి, ఒంగోలు వైపు ఎక్కువగా బస్సు సర్వీసులు ఉన్నాయి. ప్లాట్‌ఫాంపై ఉన్న బస్సులో ఎక్కి కూర్చున్న ప్రయాణికులు అది కదిలేంత వరకు వేచి చూడాల్సి వస్తోంది. మరో డిపో బస్సు వస్తే ప్రయాణికులు వెంటనే బస్సు దిగి వెళ్తున్నారు. కొందరైతే బస్సు ఎప్పుడు బయలుదేరుతుందో తెలియక అలానే కూర్చుంటున్నారు. దీంత సమయం వృథా అవుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి టైమింగ్ బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



టైమింగ్ బోర్డులు లేని ఓ బస్సు

# దివ్యాంగ విద్యార్థుల గుర్తింపుపై సర్వే

పెద్దారవీడు: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థులను చదువుకునేలా ప్రోత్సహిస్తోందని ఎంఈఓలు పి.శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలో తోకపల్లిలో దివ్యాంగ చిన్నారుల గుర్తింపు సర్వే మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులను గుర్తించేందుకు మండల వ్యాప్తంగా ఇంటింటా సర్వే చేస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు పాఠశాలలో చేరని వారితో పాటు మధ్యలో విద్యకు దూరమైన వారి వివరాలు సేకరిస్తున్నామన్నారు. చదువుతో ప్రయోజనాలు, దివ్యాంగుల సంక్షేమానికి అమలవుతున్న రాయితీలు, సదుపాయాల గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తున్నామని పేర్కొన్నారు. సాధారణ విద్యార్థులతో సమానంగా దివ్యాంగులను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. మండలంలో వైకల్యం ఉన్న వారికి వంద శాతం మందిని గుర్తించి పాఠశాలల్లో చేర్పడమే లక్ష్యంగా కార్యచరణ రూపొందించామని తెలిపారు. ఇప్పటి వరకూ మండల పరిధిలో 32 మందిని ఐఈఆర్టీలు గుర్తించారని, అవసరమైన విద్యార్థులను భవిత కేంద్రంలో చేర్పించి ప్రత్యేక సేవలు అందిస్తామన్నారు. ఐఈఆర్టీలు బాలవర్ధన్‌రాజు, బీబీ, సీఆర్పీ వీరాంజనేయులు పాల్గొన్నారు.



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం

# గొడవలు చేస్తే రౌడీషీట్లు తెరుస్తాం

దర్శి: ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజు గొడవలు చేస్తే రౌడీషీట్లు తెరుస్తామని సీఐ సమీఉల్లా హెచ్చరించారు. మండలంలోని శేషంవారిపాలెంలో బుధవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో వాహనాలు తనిఖీ చేశారు. అనుమానిత నివాసాలు పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని చెప్పారు. ఎన్నికల లెక్కింపు రోజు గొడవలు జరగకుండా ఉండేందుకు గ్రామాల్లో బైండోవర్ కేసులు పెట్టామన్నారు. శాంతి భద్రతలు అదుపులో ఉండేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎస్సై సుమన్, ఏఎస్ఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ సమీఉల్లా